ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా కార్తీక్

హనుమకొండ, మే 28: ఖిలా వరంగల్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కార్తీక్‌ను నియమించారు. కార్తీక్ నియామకంపై అధికారిక ఉత్తర్వులు జారీ చేశామని జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వీటిలో భూపాలపల్లి, కొడకండ్ల, వరంగల్ రూరల్, ఖిలావరంగల్, జనగామ, నర్సంపేట కార్యాలయాల్లో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లే విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఖిలావరంగల్ సబ్ రిజిస్ట్రార్ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజేశ్‌ను నియమించారు. వరంగల్‌లో నిబంధనలు విస్మరించి నాన్ లేఅవుట్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారనే ఫిర్యాదు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు. నిజమని తేలడంతో రాజేశ్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ సుభాషిణి ఉత్తర్వులు జారీ చేశారు.

ధర్నా చేస్తున్న కాలనీల వాసులు

జనావాసాల మధ్య బార్ వద్దు

కాజీపేట, మే 28: జనావాసాల మధ్య నూతన బార్‌కు పర్మిషన్ రద్దు చేయాలని అఖిలపక్ష నాయకులు, మాజీ కార్పొరేటర్లు గొట్టిముక్కల రమణారెడ్డి, నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. ఈ మేరకు సిద్ధార్థనగర్, వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేయనున్న నూతన బార్‌ను వ్యతిరేకిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో కాలనీవాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కోటిలింగం, బీజేపీ స్పోక్‌పర్సన్ రామ్మోహన్, సాంబయ్య, గోపాల్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నాగరాజు(ఫైల్)

ఎల్కతుర్తి, మే 28: గోపాల్‌పూర్‌కు చెందిన పెండ్యాల నాగరాజు(37) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు మంగళవారం తెలిపారు. నాగరాజు తన 7.25 ఎకరాల భూమిలో సాగు కోసం రెండేళ్ల నుంచి పెట్టుబడి కోసం రూ. 5 లక్షల వరకు అప్పు చేశాడు. దిగుబడి సరిగ్గా రాకపోవడంతో అప్పులు తీర్చలేనని బెంగతో తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. నాగరాజుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

కాశీబుగ్గ, మే 28: నగరంలోని సంతోషిమాత ఆలయం వెనుక ఇంటి నిర్మాణ పనుల్లో విద్యుత్ షాక్‌తో ఓ వృద్ధురాలు మృతి చెందింది. రామన్నపేటకు చెందిన కంచర్ల రాజేశ్వరి(55) కూలి పని కోసం కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి వెళ్లింది. బోర్ మోటారు స్విచ్ వేయగా షాక్‌కు గురైంది. వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

ఐనవోలు, మే 28: అట్రాసిటీ కేసుపై మంగళవారం మామునూరు ఏసీపీ తిరుపతి విచారణ చేపట్టారు. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గిర్మాజీపేటకు చెందిన బుట్టి రంజిత్ పంథినిలో పెట్రోల్ బ్యాంక్ ఏర్పాటు కోసం ఓ వ్యక్తి వద్ద భూమికి లీజుకు తీసుకున్నాడు. ఆ భూమి పైనుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉండడంతో బంక్ ఏర్పాటుకు అనుకూలం కాదని రంజిత్ నిరాకరించాడు. సదరు భూ యజమాని లీజ్ అగ్రిమెంట్ ప్రకారం కొంత పెట్టుబడి పెట్టి భూమిని చదును చేయించాడు. రంజిత్ లీజ్‌ను రద్దు చేసుకోవడంతో భూ యాజమాని తను పెట్టిన పెట్టుబడి తిరిగి ఇవ్వాలని కోరాడు. ఈ విషయాన్ని భూ యజమాని లీజ్‌దారుడి ఇంటికి వెళ్లి అడిగాడు. దీంతో తనను కులం పేరుతో దూషించాడని లీజ్‌దారైన బుట్టి రంజిత్ భూ యజమానిపై ఐనవోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదైంది.

బైక్‌ను ఢీకొట్టిన కారు : ఇద్దరికి గాయాలు

ఆత్మకూరు, మే 28: ఆత్మకూరు మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కారు-బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ములుగు జిల్లా మహ్మద్‌గౌస్‌పల్లికి చెందిన క్షతగాత్రులు గొట్టిముక్కుల సుశీల-అశోక్ దంపతులను ఎస్సై రాకేశ్ రెడ్డి ఎంజీఎం దవాఖానకు తరలించారు.

ముంపు నివారణకు ప్రణాళికలు రూపొందించాలి

- అనధికారికంగా చెత్తను డంపింగ్ చేస్తే జరిమానా
- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 28: గ్రేటర్ లోతట్టు ప్రాంతాల ముంపు నివారణకు ప్రణాళికలు రూపొందించాలని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తమ పరిధిలోని ముంపు ప్రాంతాలపై అవగాహన ఉండాలన్నారు. ముంపు సమస్య పరిష్కార మార్గాలు తెలిసి ఉండాలన్నారు. డివిజన్ వారీగా డ్రైనేజీల సమాచారాన్ని అందివ్వాలన్నారు. వర్షాల నేపథ్యంలో నగరంలోని డ్రైనేజీలు పొంగడానికి కారణాలు అన్వేషించాలని, గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా వివరాలు సేకరించి అందజేయాలని ఆదేశించారు. గ్రేటర్‌లోని కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ అనుకున్న స్థాయిలో జరుగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అనధికారికంగా ఎక్కడ పడితే అక్కడ చెత్త డంపింగ్ చేస్తే జరిమానా విధించాలన్నారు. ఫాగింగ్ జరిగేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్లు మాదాసి సాంబయ్య, నరేందర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి..

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెల 31లోగా పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరంగల్ పరిధిలోని పాఠశాలల అభివృద్ధిపై డీఈలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణాలను 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే కార్మికుల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, సారంగం, రంగారావు, రవికిరణ్, శివానంద్ పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : డీఈవోలు

గిర్మాజీపేట/హనుమకొండచౌరస్తా, మే 28: వచ్చే నెల 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వరంగల్ జిల్లాలోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్-ఏ, బీ రెండు కేంద్రాల్లో నిర్వహించనున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో వాసంతి తెలిపారు. ఈ పరీక్షలను 806 మంది రాయనున్నారని, హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారమిచ్చి, పిల్లలు సకాలంలో సెంటర్లకు హాజరయ్యేలా చూడాలని కోరారు. అలాగే, జిల్లాలోని ఆరు మోడల్ స్కూళ్లలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాని డీఈవో సూచించారు. ఈ నెల 31లోగా www.tsmodelsc hools.comలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే, హనుమకొండ జిల్లాలో ప్రథమ భాషకు 194, ద్వితీయ భాషకు 13, ఆంగ్లం 201, గణితం 182, సామాన్య శాస్త్రం 217, సాంఘిక శాస్త్రం పరీక్షకు 61 మంది విద్యార్థులు హాజరవుతారని డీఈవో అబ్దుల్ హై పేర్కొన్నారు. లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అభ్యసనోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వర్ధన్నపేట, మే 28: ఎవరూ లేని సమయంలో తాళం వేసి ఉన్న గడియాను కత్తిరించి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన ఘటన వర్ధన్నపేట పట్టణంలో మంగళవారం జరిగింది. పట్టణానికి చెందిన గుజ్జ ఆనందరావు కుటుంబంతో కలిసి సోమవారం హైదరాబాద్‌కు వెళ్లాడు. దుండగులు సోమవారం రాత్రి ఇంటి ప్రహరీ దూకి గడియను కత్తిరించి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం బీరువాలో ఉన్న నగదు తోపాటు బంగారాన్ని అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

వరంగల్ నిట్‌లో అంతర్జాతీయ సదస్సు

మూడు రోజుల పాటు జరుగనున్న సెమినార్

అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

హనుమకొండ చౌరస్తా, మే 28: నిట్‌లో హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ కాన్‌క్లేవ్ (హెచ్‌ఎస్ఎస్ ఆర్‌సీ) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు 'హ్యుమానిటీస్ ఎట్ ది క్రాస్ రోడ్స్ : ది కన్వర్జెన్స్ ఆఫ్ లాంగ్వేజ్, సాహిత్యం, సాంకేతికత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎస్ఎస్ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి, కాన్ఫరెన్స్ కాన్‌క్లేవ్ స్థూలదృష్టిని సమర్పించారు. అనంతరం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. హ్యుమానిటీస్ డిపార్ట్‌మెంట్ ఎన్ఐటీలో సమగ్ర పాత్ర పోషిస్తుందని చెప్పారు. హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ సొసైటీ (హెచ్‌యూఎంఎస్ఎస్) లోగో, సమావేశ కార్యక్రమాలను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ వేణు వినోద్, శ్రీలంక మహర గామ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ దర్శన సమరవీర అసిస్టెంట్ ప్రొఫెసర్ స్ఫూర్తి పాల్గొన్నారు.

పెంచికల్‌పేటలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రైతులకు అందుబాటులో ఉండాలి

కార్పొరేషన్ డీఎం మహేందర్

ఆత్మకూరు, మే 28: అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని కార్పొరేషన్ డీఎం మహేందర్ అన్నారు. మంగళవారం పెంచికల్‌పేట సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కోతలు పూర్తయ్యాయా? అని వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ సివిల్ సప్లయ్ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్, ఏఈవో మానస, సీఈవో ఓదెల లక్ష్మయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, మే 28: వచ్చే నెల 4న లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈసీ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని కౌంటింగ్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతుందన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, వెంకట్‌రెడ్డి, ఏఆర్వోలు నారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు. కాగా, ఓట్ల లెక్కింపుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

సురేశ్‌కు డాక్టరేట్

సురేష్

హనుమకొండ చౌరస్తా, మే 28: హనుమకొండ పింగిళి మహిళా కాలేజీలో 11 సంవత్సరాలుగా అతిథి అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న పెండ్యాల సురేశ్‌కు రాజస్థాన్‌కు చెందిన సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఫైనాన్షియల్ పర్ఫార్మెన్స్ ఆఫ్ నేషనలైజ్డ్ బ్యాంక్స్ ఇన్ ఇండియా -ఏ కేస్ స్టడీ ఆఫ్ బ్యాంక్ ఆఫ్ బరోడా' అనే అంశంపై సన్‌రైజ్ యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు సురేశ్‌ను డాక్టరేట్ వరించింది.

భక్తిభవాన్ని పెంపొందించుకోవాలి: దొంతి


పూజలు చేస్తున్న మాధవరెడ్డి

ఖానాపురం, మే 28: ప్రతి ఒక్కరూ భక్తి భవాన్ని పెంపొందించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. బుధరావుపేటలోని వేంకటేశ్వరాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం దొంతి పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రహరీ, ప్రధాన ముఖ ద్వారం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహాలక్ష్మీ వెంకట్రామనర్సయ్య, చెడుపాక ఉపేందర్, గిరిగాని నర్సయ్య పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

చెన్నకేశవులు(ఫైల్)

కాశీబుగ్గ, మే 28: ఇటీవల ఆత్మహత్యయత్నానికి పాల్పడి తీవ్ర గాయాలైన ఓ యువకుడు ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాశీబుగ్గకు చెందిన అల్లం, ఎల్లిగడ్డల వ్యాపారి మేకమల్ల వెంకట్ కుమారుడు చెన్నకేశవులు(19), ఖమ్మంకు చెందిన సుష్మిత సోషల్ మీడియా ద్వారా ప్రేమించుకున్నారు. చనిపోవాలని నిర్ణయించుకొని ఇద్దరూ ఇటీవల హంటర్‌రోడ్డు ప్రాంతంలో రైలు కింద పడ్డారు. సుష్మిత అక్కడికక్కడే మృతి చెందగా చెన్నకేశవులును ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పెద్దాపురంలో మహిళ..

సంగెం,(గీసుగొండ): చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన గీసుగొండ మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దాపురం గ్రామానికి చెందిన మిట్టపల్లి సాంబ(60)ను ఎనుమాముల మార్కెట్ నుంచి ఆళ్ల శివయ్య బైక్‌పై ఎక్కించుకుని వెళ్తున్నాడు. శివయ్య అజాగ్రత్తగా నడపడంతో మొగిలిచర్ల శివారులో సాంబ బైక్ పైనుంచి కిందపడింది. తీవ్ర గాయాలు కావడంతో ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాయిరెడ్డి వెంకన్న తెలిపారు.

కాకతీయుల చరిత్రను కాపాడుకోవాలి

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపేంద్రశర్మ, సుదర్శన్

హనుమకొండ చౌరస్తా, మే 28: కాకతీయుల చరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బ్రాహ్మణసేవా సమితి గౌరవాధ్యక్షుడు, వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో మాజీ కార్పొరేటర్ రావుల సుదర్శన్ రచించిన 'కాకతీయ సమగ్ర చరిత్ర' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కాకతీయుల చరిత్ర గోల్కొండ కోట నుంచి తమిళనాడు వరకు ఉందని, ఇప్పటికీ గుంటూరు జిల్లాలో ఆధారాలు ఉన్నాయని ఉపేంద్రశర్మ అన్నారు. 1163 నుంచి కాకతీయుల చరిత్ర ఉందని, వారు 180 దేవాలయాలను నిర్మించారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లోని పూడిక తీశారని గుర్తుచేశారు. పులి రజినీకాంత్, బండారి రాజు, వడ్డె రవికుమార్, సంతోష్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న రేణుకాదేవి

కుట్టు మిషన్ కేంద్రం సందర్శన

చెన్నారావుపేట, మే 28: మండల కేంద్రంలోని స్త్రీశక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రేణుకాదేవి మంగళవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ మహిళలతో కుట్టించాలని తెలిపారు. మహిళలు సమష్టిగా ఒకే చోట కేంద్రాన్ని ఏర్పాటు చేసి కుట్టడంతో పనిలో మెళకువలను నేర్చుకోవడంతోపాటు మరిన్ని అవకాశాలు పొందుతారని వివరించారు. రానున్న రోజుల్లో మహిళలకు కటింగ్, కుట్టడంలో ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. ఏపీఎం ఈశ్వర్, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ మంజుల, వీవీఏలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

వైద్య పరీక్షలు చేస్తున్న యాకూబ్ పాషా

వరంగల్, మే 28: రుతుస్రావ సమయంలో మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్ పాషా అన్నారు. రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అన్ని ఆరోగ్యకేంద్రాల్లో 15 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగిన మహిళలకు మంళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వైద్య పరీక్షలు చేశారు. 5 రోజులకు మించి రుతుస్రావం జరిగితే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

కమలాపూర్, మే 28: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కమలాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సైదమ్మ, భారతి, చక్రవర్తి, గోవిందు, మొగిలి పాల్గొన్నారు.

అమీనాబాద్ నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో కల్పన

మొక్కలను సిద్ధం చేయాలి

చెన్నారావుపేట, మే 28: హరితహారంలో నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని డీపీఓ కల్పన అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాబాద్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పల్లెప్రకృతి వనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటికలను పరిశీలించారు. హరితహారంలో ఎక్కువ మొక్కలు నాటాలన్నారు. గ్రామ కార్యదర్శి సురేశ్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

దామెర, మే 28: మండలంలోని ఊరుగొండలోని పెద్దాపురం పీఏసీఎస్ కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు మంగళవారం తెలిపారు. విత్తనాల కోసం రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్‌లను అందజేయాలని కోరారు.

రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అకుట్ సభ్యులు

వర్సిటీ అభివృద్ధి అందరి బాధ్యత

హనుమకొండ చౌరస్తా, మే 28: కేయూలో అకడమిక్ పాలన మందగించిందని, వర్సిటీలో నిరంకుశ పాలన అంతమయిందని, ఈ మూడేళ్లలో నష్టపోయిన అధ్యాపకులందరికీ న్యాయం చేయాలని కోరుతూ అకుట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, ఉపాధ్యక్షులు బ్రహ్మేశ్వరి, రమేశ్ మంగళవారం రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ వీసీ చివరి తీసుకున్న నిర్ణయాలపై రివ్యూ చేయాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది
మాదారపు రవి కుమార్, తండ్రి. రామచంద్రయ్య, R/o. వికాస్ నగర్, హన్మకొండ (HNK), PP No. T1538993 పాస్‌పోర్ట్ సుబేదారి నుండి వికాస్ నగర్ వెళ్లు మార్గంలో పోయినది. దొరికిన వారు సంప్ర.:
8008976649

CHANGE OF NAME
I, KARRA LAVANYA (New Name), previously called SANKATI RAJITHA (Old Name), and residing at H.No. 3-230, Katrapally (Haveli) Village, Sangem Mandal, Warangal Dist.-506330, T.S., India. and solemnly declare.

WANTED
★నవ్యశ్రీ మహిళా వెల్ఫేర్ సొసైటీ CBO లో పని చేయుటకు అనుభవజ్ఞులైన అకౌంటెంట్స్ కావలెను. NGO's లో CBO లలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. Qualification Commerce & Tally Accounting Package. సంప్ర: 9059149058, 7901220314.
NTW-00
★అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

అధ్యాపకులు సిలబస్‌కే పరిమితం కావొద్దు

కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

హనుమకొండ చౌరస్తా, మే 28: అధ్యాపకులు సిలబస్‌కే పరిమితం కావొద్దని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. గణిత శాస్త్ర సెమినార్ హాల్‌లో క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వ పాలిటెక్నిక్ (ఇంగ్లిష్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణిత శాస్త్ర విభాగం) అధ్యాపకులకు నిర్వహిస్తున్న '3 వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రాం' ప్రారంభ సమావేశంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు సబ్జెక్ట్‌తోపాటు ఇండస్ట్రీలో మార్పులు, ఇన్నోవేషన్లు, కొత్త ఆవిష్కరణలపై వివరించాలన్నారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి శ్రీలత, కెమిస్ట్రీ విభాగాధిపతి సవితా జ్యోత్స్న, ఇంగ్లిష్ విభాగాధిపతి దీపా జ్యోతి, సురేశ్‌లాల్, బ్రహ్మేశ్వరి, హనుమంతు, మంజుల, రాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి

మాట్లాడుతున్న గడ్డం సదానందం

నర్సంపేటరూరల్, మే 28: రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం సదానందం డిమాండ్ చేశారు. ఈ నెల 30న మహేశ్వరంలో జరుగనున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాజకీయ శిక్షణ తరగతులను ఉద్దేశించి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలను రైతాంగానికి ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా 50 శాతం సబ్సిడీపై మినీ ట్రాక్టర్లను అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024లోనే స్వామినాథన్ కమిషన్ సిఫారసు అమలు చేసి రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని విమర్శించారు. సమావేశంలో డివిజన్ సహాయ కార్యదర్శి రాజు, జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, నాయకులు పాణి, లాల్, మనోహరచారి, రాజేందర్, శ్రీనివాస్, శ్రావణ్, మురళి, గోపి పాల్గొన్నారు.

గోడలకు నోటీసులు అంటిస్తున్న బ్యాంక్ అధికారులు

ఏడుగురు రైతులకు నోటీసులు

ఆత్మకూరు, మే 28: మండలకేంద్రంలోని డీసీసీ బ్యాంక్‌లో రుణం తీసుకుని చెల్లించని చౌళ్లపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు గ్రూపు రైతుల పేర్లను మంగళవారం జీపీ నోటీసు బోర్డుపై నోటీసులు అంటించారు. రైతులు జేఎల్‌జీ స్కీమ్ ద్వారా అప్పు తీసుకున్నారని డీసీసీబీ నోడల్ అధికారి హరిత అన్నారు. తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో నోటీసులు అంటించామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్వేత, సూపర్‌వైజర్ రాజేశ్ పాల్గొన్నారు.

దామెరలో పత్తి విత్తన ప్యాకెట్లు సీజ్

దామెర, మే 28: దామెరకు చెందిన హింగె రవీందర్ వరంగల్ స్టేషన్‌రోడ్‌లో ఉషోదయ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపును నడిపిస్తున్నాడు. అతడి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రణధీర్-2, సంకేట్-30 ప్యాకెట్లు, యుఎస్7067-10, స్విఫ్ట్-2, వింధ్య రెండు ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. వీటి విలువ రూ. 39744 ఉంటుందని ఎస్సై కొంక అశోక్ తెలిపారు.

బీరన్న ఆలయం ముస్తాబు

గత సర్కార్ ప్రోత్సాహంతోనే నిర్మాణం

ఉప్పల్‌లో నిర్మించిన బీరన్న ఆలయం

కమలాపూర్, మే 28 : మండలంలోని ఉప్పల్ గ్రామంలో గొల్లకుర్మల ఆరాధ్య దైవమైన బీరన్న నూతన ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్లకుర్మల కోసం రూ.12లక్షల నిధులు కేటాయించగా, ఆలయ నిర్మాణం ప్రారంభించారు. నిర్మాణం పూర్తి కావడంతో బీరన్న కల్యాణ వేడుకలకు సిద్ధం చేశారు.

మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎల్కతుర్తి, మే 28: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్సై గోదారి రాజ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఎల్కతుర్తి రైతువేదికలో వ్యవసాయ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో ఎరువులు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. డీలర్లు విక్రయించే విత్తనాలు, ఎరువులు, మందుల కంపెనీ, రైతుల వివరాలను విధిగా తమ రిజిస్టర్‌లో నమోదు చేయాలనారు. ఏవో రాజ్‌కుమార్, ఏఈవోలు రాజు, తిరుపతి, కల్యాణి, రోజా పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఐదు సెల్‌ఫోన్లు అప్పగింత

కాశీబుగ్గ, మే 28: ఎనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురికి పోలీసులు పట్టుకొని అప్పగించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా టెక్ టీమ్ ఆచూకీ తెలుసుకొని బాధితులకు అప్పగించినట్లు సీఐ పులి రమేశ్‌గౌడ్ తెలిపారు. సెల్‌ఫోన్‌లను చాకచక్యంగా ట్రేస్ చేసిన ఎస్సై పోగుల శ్రీకాంత్, కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌ను అభినందించారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న పోలీసులు